ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు సీఆర్‌డీఏ సమావేశం జరిగింది.
- ఎన్టీఆర్ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- గంజాయి రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా రెండవ జాతీయ లోక్ అదాలత్ ను ఈరోజు నిర్వహించారు.
- రానున్న రెండు రోజుల్లో ఉత్తర కోస్తాంధ్రలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==================

రాజధాని అమరావతి పరిధిలో అదనంగా 20,494 ఎకరాల మేర భూ సమీకరణకు సీఆర్డీఏ ఆమోదం తెలిపిందని పట్టణాభివృద్ధి, పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ వెల్లడించారు. ఈరోజు ఉండవల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 50వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఆ వివరాలను మంత్రి నారాయణ పాత్రికేయులకు వెల్లడిస్తూ.. మొత్తం ఏడు అంశాలను సీఆర్డీఏ సమావేశంలో ఆమోదించామని చెప్పారు. సీబీఐ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, ఎంఎస్కే ప్రసాద్ క్రికెట్ అకాడెమీ, కిమ్స్ సహా 16 సంస్థలకు 65 ఎకరాల మేర భూ కేటాయింపులకు ఆమోదం తెలిపిందని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్...32 సెకన్లు)

==================

ఎన్టీఆర్ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడలో నియోజకవర్గ దార్శనిక ప్రణాళికలు, స్వర్ణాంధ్ర-పీ4 ఫౌండేషన్‌పై ఈరోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రణాళికపై కలెక్టర్ లక్ష్మీశ వివరాలు అందించగా, ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ప్రణాళికలను ఆయా నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ లో 2047 నాటికి రూ.18.23 లక్షల కోట్ల రూపాయల జీడీపీని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. సుపరిపాలనలో పీ4 కార్యక్రమం కీలక అధ్యాయమన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికల రూపకల్పన జరిగిందని మంత్రి పేర్కొన్నారు. అమరావతి నుంచి అనేక ప్రాంతాలకు వెళ్లేలా ప్రధాన రహదారులు అనుసంధానం చేస్తామన్నారు.

==================

గంజాయి రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా ధర్మవరం గ్రామంలో ఈరోజు పర్యటించిన హోంమంత్రి, సుపరిపాలనలో తొలి అడుగు

కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను మంత్రి వివరించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలన పారదర్శకంగా సాగుతోందని, ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం ప్రారంభమతుందని వెల్లడించారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగావకాశాలు రానున్నాయని ప్రకటించారు. ఈగల్ వ్యవస్థ ద్వారా గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిని కఠినంగా శిక్షిస్తున్నామని హోంమంత్రి తెలియజేస్తూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

===================

జాతీయ లోక్ అదాలత్ లో ఇచ్చిన తీర్పు అత్యుత్తమ తీర్పు అని శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానం లోక్ అదాలత్ న్యాయ మూర్తి కె.హరిబాబు అన్నారు. ఈరోజు శ్రీకాకుళం జిల్లా కోర్టులో జాతీయ లోక్అధాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కె.హరిబాబు మాట్లాడుతూ.. ఈ జాతీయ లోక్ అదాలత్ లో సుమారు నాలుగు వేల కేసులను రాజీ చేసే అంచనాతో19 బెంచ్ లు ఏర్పాటు చేశామని తెలిపారు.
అలాగే.. జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ కోరారు. జిల్లా కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ ను ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఈ లోక్ అదాలత్ ఎంతో ఉపయోగకరమన్నారు.

===================

విరామం

===================

కుటుంబాల్లోని పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం బంగారు కుటుంబం కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టిందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంపై అధికారులతో కలెక్టర్ ప్రత్యేక కార్యశాల నిర్వహించి ఈరోజు పలు సూచనలు చేశారు. జిల్లాలో 42,817 బంగారు కుటుంబాలు ఉన్నాయని, ఆ కుటుంబాలను మార్గదర్శితో సమన్వయం చేయాలన్నారు. బంగారు కుటుంబం, మార్గదర్శి మధ్య అంతరాన్ని పూడ్చడానికి అధికారిక బృందం స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. కుటుంబ అవసరాలను తెలుసుకుని మార్గదర్శితో సమన్వయం చేసుకోవడానికి, సర్వే నిర్వహించాలని కలెక్టర్ సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు.

===================

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ అసుపత్రి మాదిరిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఈరోజు వైరస్ రీసెర్చ్ డయాగ్నోస్టిక్ లాబొరేటరీ నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ ల్యాబ్ లో అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని, మూడు నెలల్లో ల్యాబ్ పనులు పూర్తయి, సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న ఓపీ బ్లాక్ ను నూతనంగా నిర్మించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరామని, మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...30 సెకన్లు)

===================

నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువులో రేపు మొహరం సందర్భంగా నిర్వహించే రొట్టెల పండుగ కోసం విస్తృత ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. రొట్టెల పండుగ నిర్వహించే ప్రాంతాన్ని జిల్లా ఎస్.పి. జి.కృష్ణకాంత్ తో కలిసి కలెక్టర్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వాహనాల పార్కింగ్ కోసం 12 ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, స్వర్ణాల చెరువు స్నానాల ఘాట్ వద్ద గజ ఈతగాళ్లను నియమించామని చెప్పారు. పండుగకు వచ్చే భక్తులు సేద తీరేందుకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోటింగ్ సౌకర్యం కల్పించామని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్.పి. జి.కృష్ణ కాంత్ పేర్కొన్నారు.

===================

గుంటూరు జిల్లా మంగళగిరి అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) లో గుండె సంబంధిత వైద్య విభాగం నూతన సేవలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఈ సేవల్లో భాగంగా 7$^{th}$ జనరేషన్ బై-ప్లేన్ క్యాత్ ల్యాబ్, ట్రెడ్ మిల్ టెస్ట్ (TMT) మెషీన్ను ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డాక్టర్. అవంతెం శాంతా సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అవంతెం శాంతా

సింగ్ మాట్లాడుతూ.. ఈ ఆధునాతన వైద్య సేవలు మంగళగిరి ఎయిమ్స్ ను మరింత ముందంజలో నిలుపుతాయని పేర్కొన్నారు. రోగులకు ఆరోగ్య భద్రతను పెంచడంతో పాటు మంచి ఫలితాలను మెరుగుపరుస్తూ ప్రపంచ స్థాయి రోగ నిర్ధారణ, ఇంటర్వెన్షనల్ సేవలను అందించడానికి తమకు వీలు కల్పిస్తుందని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ బైట్...17 సెకన్లు)

===================

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీన జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పేరెంట్-టీచర్ మీటింగ్ 'మెగా పీటీఎం 2.0' కార్యక్రమాన్ని నిర్వహించాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యా శాఖ అధికారులను ఈరోజు ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు, విద్యా శాఖ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

===================

ఆంధ్రప్రదేశ్ యానాం మీదుగా దిగువ ట్రోపో ఆవరణములో పశ్చిమ గాలులు వీస్తున్న కారణంగా ఉత్తర కోస్తాంధ్ర, యానాం ప్రాంతాలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

===================
===================